క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి: టెక్కలి మండలం తలగాం ఫీడర్ పరిధిలో శుక్రవారం వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తలగాం, పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి తదితర గ్రామాల పరిధిలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బ్రెస్ట్‌ఫీడ్ రూమ్ ప్రారంభం

కాశీబుగ్గ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌ఫీడ్ రూమ్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ పనులపై పట్టణానికి వచ్చే మహిళలు తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన గది ఉపయోగంగా ఉంటుందన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన మున్సిపల్ చైర్మన్



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిబాబు

కాశీబుగ్గ: కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావును పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు బుధవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నాయకులు మద్దు రాంప్రసాద్, వల్లభ వైకుంఠరావు, రోణంకి శ్రీనివాసరావు, డబ్బీరు నాగు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నేతలు బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, పిలక చిన్నబాబు, మత్రిపాటి పూర్ణచంద్రరావు, మురళీ పట్నాయక్ ఉన్నారు.

పాఠశాలకు రూ. 1.10 లక్షల సాయం



లక్ష రూపాయలు అందించిన దంపతులు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని శ్రీ రాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు తమవంతు ఆర్థిక సాయం చేస్తున్నారు. 125 ఏళ్ల క్రితం భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామ పెద్దలు కమిటీగా ఏర్పడి, పునఃనిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మందస పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సీతారాం, పుష్పవతి దంపతులు తమవంతు సాయంగా ఒకలక్ష రూపాయలను కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే సీతారాం కుమారుడు శ్రీనివాస్, శ్రీలత దంపతులు కూడా రూ. 10 వేలు విరాళంగా ఇచ్చారు.


ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కొళిగాం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ బుధవారం పోటీలను ప్రారంభించారు. బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల పరామర్శ

వజ్రపుకొత్తూరు: గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేసిన కె.రామారావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అతని స్వగ్రామం రాయపాడు బుధవారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగు పండితునిగా పూండి-గోవిందపురం పరిసర ప్రాంతాలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మద్దిల హరి నారాయణ, కీలు లోకనాథం, ద్రౌపది, సుందరరావు, గణపతిరావు, నిర్మల ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్ జయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కంచిలి: కంచిలి మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వై.జయలక్ష్మిని వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు కొణపల సురేష్, పలికల జయరాం, లద్దు కేశవపాత్రో, డొక్కరి బలరాం, పైల లక్ష్మీనారాయణ, తలగాన తిరుపతి ఉన్నారు.

తీరంలో భయం!



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన అక్కుపల్లి బీచ్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా అక్కుపల్లి తీరం
- మందుబాబులు హల్‌చల్
- భయాందోళన చెందుతున్న పర్యాటకులు



కుప్పలుగా పడి ఉన్న మద్యం సీసాలు

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్దానం ప్రాంతానికి మణిహారంగా ఉన్న అక్కుపల్లి శివసాగర్ తీరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో పర్యాటకులు ఇక్కడకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడకు ఒడిశా రాష్ట్ర వాసులతోపాటు శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ, పలాస పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం వచ్చి తీరంలో సందడి చేస్తూ మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. అయితే కొంత మంది ఆకతాయిల తీరు స్థానికులతో పాటు పర్యాటకులకు పంటిలో పడిన రాయిలా మారింది. తీరంలో సరదాగా గడుపుదామని వస్తే ఆకతాయిల ఆగడాలతో అవస్థలు పడుతున్నారు.

మద్యం మత్తులో యువకులు అల్లరి..

సముద్రంపై నుంచి వీచే చల్లని గాలులు ఓ వైపు సవ్వడి చేస్తుంటే మరో వైపు తీరంలో మందుబాబుల అగడాలు శృతిమించుతున్నాయి. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు, వ్యాపారులతో పాటు అన్నివర్గాల ప్రజలు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుదామంటే ఉద్దాన ప్రాంతంలో వెకేషన్‌లు, హాలిడే స్పాట్లు లేవు. దీంతో అలాంటి వారికి తీరమే దిక్కు. అయితే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. మందుబాబులు పూటుగా తాగి పగలుగొట్టిన మద్యం సీసా పెంకులు తీరానికి వచ్చేవారికి స్వాగతం పలుకుతున్నాయి. అలాగే ఇక్కడకు వచ్చే ప్రేమ జంటలపై సైతం మందుబాబులు దాడి చేసి ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన స్నేహితులు దినోత్సవం రోజున కొంతమంది ఆకతాయిలు మద్యం సేవించి తీరంలో హల్‌చల్ చేసి సముద్ర స్నానానికి దిగి అలలకు చిక్కారు. దీనిని గమనించిన మత్స్యకారులు వారిని ప్రాణాలతో కాపాడారు.

అనధికార మద్యం షాపులు!

బాతుపురం-బైపల్లి రోడ్డులో ప్రభుత్వ మద్యం షాపు ఉంది. అయితే తీరానికి సమీపంలో అనధికారికంగా మద్యం షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. అక్కుపల్లి బీచ్ రోడ్డులో అక్రమంగా కొంత మంది మద్యం అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు!

ఆకతాయిలకు అడ్డాగా శివసాగర్ బీచ్ ఏరియా మారినప్పటికీ ఇటువైపు పోలీసులు చూడడం లేదని విమర్శలున్నాయి. మద్యం బాటిళ్లు ఎక్కడికక్కడే కుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి.

అభివృద్ధి నిధులు దుర్వినియోగం

అక్కుపల్లి శివసాగర్ బీచ్ అభివృద్ధికి ఏడేళ్ల క్రితం కోటి రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. అయితే అప్పటి గుత్తెదారులు నాసిరకంగా పనులు చేపట్టడంతో రక్షణ గోడ సముద్ర అలల తాకిడికి కొట్టుకుపోయింది. అలాగే తీరంలో ఏర్పాటు చేసిన షెడ్లు తిత్లీ తుఫాన్‌కు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి తీరంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ షెడ్‌లు మందుబాబులకు ఉపయోగపడుతున్నాయి.

తీరంపై ప్రత్యేక దృష్టి



సముద్ర తీరాలకు వచ్చే పర్యాటకుల పట్ల ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రధానంగా మద్యం సేవించి బీచ్‌లో హల్‌చల్ చేసేవారిని సహించం. శివసాగర్ బీచ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రత్యేక చర్యలు చేపడతాం.

–సీహెచ్ రామారావు, ఎస్‌ఐ, వజ్రపుకొత్తూరు

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు. తమతో పాటు కలిసి చదువుకున్న గుళ్లలపాడు గ్రామానికి చెందిన బగాతి నాగార్జున ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు రూ. 33,200 విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతిని కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసి ఆత్మస్థైర్యాన్ని నింపారు. పూర్వ విద్యార్థులు ఆర్.శ్రీనివాసరావు, కణితి సూర్యారావు, ఆకుల కామేశ్వరరావు, శిస్టు గౌతంకుమార్ ఉన్నారు. అలాగే కొన్ని నెలల క్రితం తోటి స్నేహితుడు సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన రాజారావు మృతి చెందడంతో అతని కుటుంబానికి రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే చదువుకున్న పాఠశాలకు రూ.20 వేలు విలువ గల వంట సామగ్రిని అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

మార్పులపై అవగాహన చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

టెక్కలి: మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులంతా ఎప్పటికప్పుడు మారుతున్న మార్పులపై అవగాహన చేసుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. 'మెకానికల్ కాంపొనెట్స్ డ్రాఫ్టింగ్ బై ఆటో కేడ్' అనే అంశంపై బుధవారం కళాశాలలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'ఎక్స్‌పోజర్స్ క్రియేట్ 2డి డ్రాయింగ్ యూజింగ్ బేసిక్ డ్రాయింగ్ కామెంట్స్ ఎడిటింగ్ కమాండ్స్, యూజ్ ప్లాట్ కంట్రోల్ కమాండ్స్ ఫర్ క్రియేటెడ్ ఆటో కాడ్' తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పాక్ డైరెక్టర్ బి.రామారావు, అధ్యాపకులు పి.శ్రీహరి, సాగర్, సతీష్‌కుమార్, అనూషా ఉన్నారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ

ఇచ్ఛాపురం: స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం అందరి కర్తవ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ అన్నారు. కళాశాల ఆవరణలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా విదేశీవస్త్ర బహిష్కరణ సమయంలో చేనేత వస్తువుల ప్రాముఖ్యతను తెలియజేసేలా మహాత్మగాంధీ అనుసరించిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతిలో స్వామి వివేకానందుని గొప్పతనం గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, బృందావన్, దుర్యోధన ఉన్నారు.

పాత ఫైళ్ల చోరీపై ఆరా



చోరీపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ పాత కార్యాలయంలో ఫైళ్లు మాయమైన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆర్‌డబ్ల్యూఎస్ పాత కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిటికీలు పగలుగొట్టి పాత ఫైళ్లు మాయమైన ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి తిరిగి వాటిని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. చోరీ ఘటనకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. కార్యాలయ వెనుక భాగంలోని కిటికీలో నుంచి కొంతమంది ఆగంతకులు లోపలకు వచ్చి ఫైళ్లను ఎత్తు కెళ్లిపోయారని.. సమీపంలోని సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి వాటిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారని వెల్లడించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఫైళ్లు మాయమవుతున్న నేపథ్యంలో ఈ విషయమై ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. శిథిలావస్థకు చేరిన పాత ఫైళ్లను ఎందుకు దొంగిలించారనే అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. పరిశీలనలో కాశీబుగ్గ సీఐ విజయానంద్, ఎస్‌ఐ పారినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో పాటు నాయకులు సప్ప నవీన్‌కుమార్, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, జోగ మల్లేష్, దడియాల నరసింహ, అవుగాన షణ్ముఖరావు, యవ్వారి మోహనరావు ఉన్నారు.

మహిళల ఆర్థిక పరిపుష్టికి ముద్ర రుణాలు



మహిళలతో సమావేశమైన అధికారులు

కవిటి: స్వయంశక్తి సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కె.గోవిందరావు అన్నారు. మండలంలోని బొరివంక ఏపీజీవీ బ్యాంకులో ఈ మేరకు బ్యాంకు అధికారులు, స్వయంశక్తి సంఘాల సిబ్బందితో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల జీవనోపాధి, పారిశ్రామికంగా అభివృద్ధి చెందే విధంగా రూ. రెండు లక్షల నుండి ఐదు లక్షల రూపాయల వరకు వ్యక్తిగత రుణాలు ప్రతి గ్రామానికి 25 యూనిట్లు ఇవ్వాలని అధికారుల ఆదేశాల మేరకు లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు.

మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

పలాస: మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని, ఈ మేరకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ కోరారు. మండలంలోని చిన్ననీలావతి గ్రామంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో ఏక్షణం ఏమి జరుగుతుందోనన్న అభద్రతా భావంతో మహిళలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వికసించాల్సిన చిన్నారులపై నేటి సమాజం విషం చిమ్ముతోందన్నారు. ఇటువంటి సంస్కృతి వ్యాపించడానికి పాలక వర్గాలే కారణమని ఆరోపించారు. సమావేశంలో సంఘం నాయకులు గుండమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



బీరువాను అందజేస్తున్న విద్యార్థినులు

సంతబొమ్మాళి: చదువుకున్న పాఠశాలకు తమవంతుగా సహాయం అందించి బడిరుణం తీర్చుకున్నారు దండుగోపాలపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులు. ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు అప్పిని కీర్తన, వాద్రేవు భూమిక, కింజరాపు సాత్విక, అలజంగి షణ్ముఖప్రియలు ఆరు అడుగుల ఇనుప బీరువాను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్‌ఐటీలో నలుగురు విద్యార్థినులు సీట్లు సాధించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. బాగా రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరావు, విజయలక్ష్మి, రవికుమార్, కృష్ణవేణి, మార్కండేయులు, రోజా ఉన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

టెక్కలి: ప్రస్తుతం వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా ముమ్మురంగా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో పలు వీధుల్లో ఫీవర్ సర్వేతో పాటు ఆర్‌డీ కిట్‌తో రక్త పరీక్షలు చేపట్టారు. కె.కొత్తూరు మెడికల్ అధికారి ఎస్.గాయత్రి ఆధ్వర్యంలో రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. ఎవరికైనా తీవ్రమైన జ్వరంతో పాటు ఇతర అనారోగ్య లక్షణాలు ఉంటే తక్షణమే సచివాలయం పరిధి ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సిబ్బంది కోరారు.

విద్యాకమిటీ ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరావు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నాడు జరగబోయే విద్యా కమిటీ ఎన్నికల్లో రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహించాలని, కావాలని అల్లర్లు సృష్టించాలని ప్రయత్నించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని ఈదుపురం గ్రామంలో పర్యటించి గ్రామ పెద్దల్ని కలసి మాట్లాడారు. విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయత్నించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్‌లతో మాట్లాడారు. ఆయన వెంట ఇన్‌చార్జి సీఐ హెచ్.మల్లేశ్వరరావు, రూరల్ ఎస్‌ఐ ఎన్.లక్ష్మణ్‌లు ఉన్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

నందిగాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమమ పాఠశాలలు, కేజీబీవీ, గురుకులాల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగనున్నాయని ఎంఈవో జి.నర్సింహులు తెలిపారు. 76 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులం, కేజీబీవీ, 14 ఉన్నత పాఠశాలల్లో ఎన్ని కలు నిర్వహించడానికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దిమ్మిడిజోల, కాపుతెంబూరు, నందిగాం, కణితూరు, కవిటిఅగ్రహారం ఉన్నత పాఠశాలలు, కాపుతెంబూరు, నరేంద్రపురం, సుభద్రాపురం, దీనబంధుపురం, దేవుపురం, గొల్లూరు, అన్నాపురం, కొత్తగ్రహారం ప్రాథమిక పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు కోరినట్లు ఎంఈవో తెలిపారు.

ఈక్రాప్ నమోదుపై అవగాహన

కోటబొమ్మాళి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈక్రాప్ నమోదుపై వీఆర్వోలకు తహసీల్దార్ ఆర్.అప్పలరాజు బుధవారం అవగాహన కల్పించారు. ఈక్రాప్ నమోదుతోపాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎస్.గోవిందరావు, ఉద్యానవనశాఖాధికారి కె.సునీత పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడుదాం

కాశీబుగ్గ: ఆదివాసీల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ పిలుపునిచ్చారు. మందస మండలం కుడుమాసాయి గ్రామంలో ఆదివాసీలతో కలిసి బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీలను ఆడవి నుంచి తరిమివేసి సంపదను కార్పొరేట్‌సంస్థలకు కట్టబెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. వారం రోజులు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కాలువలో పూడికలు తొలగింపు

టెక్కలి రూరల్: కొద్ది రోజులుగా కురిసిన వర్షాలతో పాత జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. దీంతో అవస్థలు తలెత్తుతున్నాయని స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందించిన అధికారులు వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు స్థానిక రోటరీనగర్-1 వద్ద ఉన్న కోడాలి ఆఫీస్ నుంచి రైల్వేగేటు వరకు కాలువపై ఉన్న ప్లేట్లను జేసీబీ సహాయంతో తీసి.. పూడికలను తొలగించారు.

నేటినుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అన్ని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు గురువారం నుంచి మూడు రోజుల పాటు రిఫ్రెష్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి, వార్షిక కార్యాచరణ ప్రణాళికలు, వీధి దీపాల నిర్వహణపై శిక్షణ ఉంటుందన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు రెఫ్రెషన్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో ప్రేమలీల తెలిపారు.

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రామారావు తెలిపారు. అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

పరిమితి దాటితే చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామారావు

సాక్షి ఎఫెక్ట్...

వజ్రపుకొత్తూరు రూరల్: ఆటోలలో పరిమితిదాటి ప్రయాణికులను ఎక్కిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు హెచ్చరించారు. 'చిన్నారులు భద్రమేనా?' శీర్షికతో సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆటోలలో పాఠశాలకు వెళ్లే చిన్నారులు జారిపడే ప్రమాదం ఉండటంతో పరిమితిగా ఎక్కించాలని, తప్పనిసరిగా ఆటోలకు రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లు గుంతలు కావడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నందున తప్పనిసరిగా పరిమితి ప్రయాణికులతో ఆటోలను నడపాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అనంతరం ఆటోడ్రైవర్ల లైసెన్స్, వాహన పత్రాలు పరిశీలించారు.

సాంకేతిక విజ్ఞానంతోనే అభివృద్ధి



విజేతలతో ఉపాధ్యాయులు

పలాస: సాంకేతిక విజ్ఞానంతోనే ఆధునిక సమాజం అభివృద్ధి చెందుతుందని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు అన్నారు. పాఠశాలలో టీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. టీసీఎస్ సభ్యులు భుజంగరావు, సీనియర్ ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధుబాబు, కొయ్యల శ్రీనివాసరావు, పద్మలోచన, జనార్దనరావు, చంద్రశేఖరరావు, పద్మ, శివప్రసాద్, ఈశ్వర్, యామిని, రజనీకుమారి, చిన్నారావు ఉన్నారు.

ప్రతి మహిళ పారిశ్రామిక వేత్త కావాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. లొద్దపుట్టి గ్రామంలో స్వయం సహాయక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, ఉమెన్ లెడ్, సీడ్ కాపిటల్, సంఘాలు వంద రోజుల్లో తీసుకోవల్సిన చర్యలను వివరించారు. సీసీ డి.మోహనరావు, వీవోఏలు లత, నీలవేణి పాల్గొన్నారు.

మత్స్యకార సంఘ నూతన కార్యవర్గం

కవిటి: మండల మహిళా సమాఖ్యకు అనుబంధంగా నిర్వహిస్తున్న మత్స్యకార సంఘాల మండలశాఖ నూతన కార్యవర్గాన్ని మహాజనసభను బుధవారం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎం కె.గోవింద ఆధ్వర్యంలో మత్స్యకార సంఘాల సభ్యులు సభను నిర్వహించారు. అధ్యక్షుడుగా గంతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడుగా బడే మాధవరావు, కోశాధికారిగా కర్రి ఢిల్లేష్, కార్యదర్శిగా లండ షణ్ముఖరావు, సహాయ కార్యదర్శిగా బడే తిరుపతితో పాటు పది మంది సభ్యుల్ని ఎన్నుకన్నారు.